# అరచేతిలో స్వర్గం

మేజాబల్ల మీద ఊదు కడ్డీలుంచిన గ్లాసు పక్కన మల్లెపూల దండ ఉంచి, ఎరగనట్లు వచ్చి పక్కమీద నడుం వాల్చేడు భానుమూర్తి. అలారం పీస్ ఆశ్చర్యంగా చూస్తోందతని కేసి.

"సరిగ్గా మరో పదినిమిషాలు. అప్పటికి అరుణకి వంటింటినుండి విడుదల లభిస్తుంది." అనుకుంటూ పైకప్పుకేసి చూడసాగేడు. ఎడమచేతి గుప్పిట బిగించి, కుడిచేతి వేళ్ళతో మద్దిల వేయసాగేడు.

వంటింట్లోంచి గిన్నెలు సర్దుతున్న చప్పుడు, నీళ్ళు జల్లుతున్న శబ్దం, నేల అలుకుతున్న సవ్వడి, లీలగా వచ్చి వీనులను తాకుతున్నాయి. వంటింటి తలుపులు మూసిన 'సద్దు' అయింది.

తల్లిని ఏదో అడుగుతోంది. అరుణ సమాధానం, ఏదో పని పురమాయింపు. తలుపులన్నీ సరిగా వేసి ఉన్నదీ లేనిదీ–గడియలు బాగా పడ్డాయో లేవో చూడాలిట! ఈ ముసలాళ్ళకి మహా చాదస్తం బాబూ.

చిరుపాదాల సవ్వడి సమీపిస్తోంది. చటుక్కున కళ్ళు మూసుకున్నాడు భానుమూర్తి. అరుణ తలుపు గడియపెట్టి నేరుగా మల్లెపూలదండ దగ్గరకెళ్ళి తల్లో తురుముకుని, ఊదుకడ్డీలు వెలిగించింది.

వెనుదిరిగి పాలనురగలాంటి పాన్పుమీద దొంగనిద్రపోతున్న భర్తను చూసి తనలో తాను చిన్నగా నవ్వుకుంది. అద్దంలో తన ప్రతిబింబాన్ని సరిదిద్దుకుని శయ్యను సమీపించి ఆసీనురాలైంది.

భానుమూర్తి ఆమె స్పర్శకి బయలుదేరిన సంచలనాన్ని బలవంతంగా అణచిపెట్టి అలాగే ఉలక్కుండా పలక్కుండా పడుకున్నాడు.

"మీ దొంగనిద్ర చాల్లెండి. ఎంత ప్రయత్నించినా అల్లల్లాడే కనురెప్పల కదలికే మీ బండారాన్నంతా బయటపెడుతోంది..."

భానుమూర్తి కళ్ళు విప్పి ఏమీ ఎరగనివాడిలా "అరె... నువ్వెప్పుడొచ్చావ్" అన్నాడు.

"నేనెపుడు వచ్చానో మీరెరుగుదురుగానీ, కాస్త అవతలికి జరిగి, జరిగి జాగా వదలండి"

"నీ జాగా? ఇదేమి దురాక్రమణోయ్, ఈ మంచం మీద నీ పేరేమన్నా రాసుందా?"

"సరే అయితే మీరొక్కరే ఆక్రమించుకోండి. నేను హాయిగా చాపమీద దిండేసుకుని

పడుకుంటాను...” అని లేవబోతున్న అరుణ కొంగు దొరకపుచ్చుకొని బలవంతాన లాగి కూర్చోబెట్టాడు.

“అంతలోనే అలుకయితే ఎలాగోయ్. ఊఁ.. నీ పనులన్నీ పూర్తయినట్లేనా? తలుపులు భద్రంగా వేశావా? గడియలు బాగా పడ్డాయా? వంటింట్లో అన్నిటి మీదా మూతలుంచావా?”

అబ్బబ్బ ఆపండి బాబూ, పని చేయడం కన్నా మీ సాధింపు భరించడం కష్టంగా ఉంది. ఎంత త్వరగా తెములుచ్చుకుని వచ్చినా మీ విసుర్లు తప్పవ్. అయినా అత్తయ్య మాటని కాదని అయ్యగారు అయిదింటికే ఆఫీసునుండి వచ్చారు గదాని పనులన్నీ వదిలిపెట్టి మీముందు కూర్చోవటం ఎలా వీలవుతుంది? అమ్మ అంటే అంతులేని భయం భక్తులు మళ్ళీ. ఆవిడ కాల్లో ముల్లు దిగితే గునపం గుచ్చుకున్నంత యిదయి పోతారు! ఆఫీసుకెళ్ళే వేళకి ఏ వస్తువందించ లేకపోయినా ఆగ్రహం ఆకాశాన్నంటుతుంది. మీ శరీరం, నాలుక స్వాధీనం తప్పుతాయి. నేనూ మనిషినేనండీ బాబూ. పాపం చేసుకుని ఆడదానిలా పుట్టాను. అంతే..అందుకింత ఘోరమైన శిక్ష విధించడమా?” ఆమె నేత్రాలు జలజల వర్షించాయి.

భానుమూర్తి కన్నులు ఆర్ద్రమైనాయి. జాలితో గుండె బరువెక్కింది. చెక్కిలిమీద జారిన కన్నీటిని తుడుస్తూ “నన్ను క్షమించు అరుణా, పొద్దున నీ మీద చెయ్యి చేసుకున్నాను కదూ? అందుకు చాలా బాధ పడ్డాను తర్వాత. కాస్త నా బూట్లు తెచ్చిపెట్టమన్నాను.

‘పని ఒత్తిడిమీదున్నాను మీరే తీసుకోకూడదాండీ” అన్నావ్.

ఆ సమయానికి అమ్మ అక్కడే ఉంది. లేకపోతే తెచ్చుకునేవాడినే. అమ్మ ఎదురుగా వెళ్ళి తెచ్చుకుంటే “వీడు వెధవైపోయాడు. నా ఘటం ఉండగానే, నా కళ్ళెదుటే పెళ్ళాం చేతిలో కీలుబొమ్మైనాడు. నేను రాలిపోయిన మర్నాటినుండి అది వీడి ముక్కుకి తాడు వేసి ఆడిస్తుంది అనుకోవటం తథ్యం, అందుకే చెయ్యి తూలేను. నన్ను మన్నించవూ” అన్నాడు దీనంగా మొహం పెట్టి.

‘అరుణ’కి ఆ క్షణంలో భర్త ఎంత తప్పు చేసినా క్షమించగల ఔదార్యం ఆవహించింది. ‘క్షమించు’ అనే మాటలో ఎంత శక్తయినా వుంది మరి.

“అబ్బే...అవేం మాటలండీ! తప్పు...మీరు నన్నలా క్షమాపణ కోరకూడదు. అంత తప్పేం చేశారనీ, భర్త కోపం కొద్దీ భార్యని ఓ చెంపదెబ్బ వెయ్యడంలో తప్పేముంది? అయినా తప్పు నాది కూడా వుందిలెండి. పరిస్థితులు ఎరుగుండి కాస్త బద్ధకం వహించడం బుద్ధి పొరపాటు..”

తన్మయంగా అక్కున చేర్చుకున్నాడు.

“అందుకే అరుణా! నువ్వంటే నాకంత యిష్టం. ఎంతటి తప్పునైనా మన్నించగల

క్షమాగుణం నీలో వుంది. అమ్మ ఆనందంకోసం అప్పుడప్పుడు నిన్ను యిలా బాధించటం తప్పనిసరి అయిపోతోంది. ఒక్కోమాటు అన్పిస్తుంటుంది-నేనింత అప్రయోజకుణ్ణి అయ్యానేమిటా అని. అమ్మ ఏదో అనుకుంటుంది గదాని 'ఆలి'ని హింసించడమా? ఈ చేతులెలా ఉన్నాయో చూడు. పుట్టింట రాకుమారిలా పెరిగిన నీ సుకుమార హస్తాలిలా అంట్లుతోమడం లోనూ, ఇల్లలకడంలోనూ ఎలా రాటుదేలాయో చూడు. ఆ అతికోమలత్వం యిపుడు కాగడాతో వెతికినా ఆగుపించదీ చేతుల్లో. ఏం చెయ్యను చెప్పు. లాభంలేదు. రేపు అమ్మతో గట్టిగా పోట్లాడి అయినా సరే అంట్లు తోమడానికో మనిషిని, వంట చెయ్యడానికో మనిషిని, ఇల్లూ వాకిళ్ళూడిచి బట్టలుతికి ఆరేయటానికో మనిషిని పెట్టిం చేస్తాను. ఏం? మరీ అంత లేక చచ్చిపోతున్నామా అనుభవించలేకపోవడానికి?"

అరుణ అందంగా నవ్వింది.

"అన్ని పనులకి నౌకర్లని పెట్టేస్తే యిక నాకోసం మిగిలిన పనేమిటి?

"నీ కోసం వదిలేసిన ముఖ్యమైన పని వుండనే వుంది. ఈ దీనుడు 'భానుమూర్తి' ఉన్నాడు చూసేవ్.. ఈ మధ్య మరీ కుర్రకుంక అయిపోతున్నాడు. వాడికి కంటెదురుగుండా కట్టుకున్నది అవుపిస్తుండాలిట. మబ్బురంగు చీర కట్టుకుని మతాబు వెలిగినట్లు నవ్వుతూ వెన్నెల్లా మెరిసిపోతూ వుండాలిట. అన్నం సయించాలంటే స్వయాన ముద్దలు కలిపి తినిపించాలట..."

"ఉహూ..మరి అత్తగారేం చేస్తారట?" పెదవులమధ్య నవ్వు బిగించి అడిగింది.

"అత్తగారు అయోధ్యకాండ చదువుకుంటూ కూర్చుంటుంది. కౌసల్యాదేవి కొడుకునీ కోడల్నీ ఎలా చూసుకున్నదీ తెలుసుకుంటుంది. ఆ ప్రకారంగానే ఆదరిస్తుంది.."

అన్నీ బాగానే వున్నాయిగానీ యిక కునుకు తీయండి. తెల్లవారితే శనివారం. చీకటితో లేచి బోలెడు, గంపెడు పనులు చేసుకోవాలి. మీకేం? మగమహారాజులు.." అంది. అతని సరసన చోటు చేసుకుంటూ.

"అబ్బే! అవేం కుదరవ్. ఈ బుచ్చబ్బాయిని జోకొట్టాలి. కమ్మగా ఓ జోలపాట పాడాలి.."

"కళ్ళు మూసుకు పడుకోండి మరీ" అంటూ మీద చెయ్యివేసి తక్కువస్థాయిలో కమ్మగా అందుకుంది. "కలలు కనే వేళ యిదే కన్నయ్యా..." అంటూ సుశీల నోటపలికిన తియ్యని గీతం.

తన్మయంగా కళ్ళు మూసుకున్నాడు భానుమూర్తి.

000

"ఉత్తిష్ట నర శార్దూల.." అన్నపదం ఆకాశవాణి పలుకుతుండగా కళ్ళు తెరిచి ఎదురుగా "శరణం వ్రజ" అంటూ అభయహస్తం చూపుతున్న ఏడుకొండలవానికి రెండు

చేతులూ జోడించి నమస్కరించాడు.

ఆ ప్రభాతంలో స్వామి సుప్రభాతం వింటుంటే ఏదో అమృతపు జల్లులో పడిపోతున్న అనుభూతి కలిగింది... అలాగే వుండిపోయాడు.

సుప్రభాతం ముగుస్తూనే మంచం దిగాడు.

మధ్య గదిలో దిగాలుగా కూర్చున్న శాంతమ్మ కొడుకు రాకతో మరింత విషాదంగా మొహాన్ని పెట్టింది. భానుమూర్తి భ్రుకుటి ముడిపడింది.

"ఏమైందమ్మా" అన్నాడు.

"ఇంకేం కావాలి నాయనా! కోడలన్న తర్వాత అత్తగారికి అణిగిమణిగి ఉండే రోజులు పాతబడినాయయ్యే..." అంది వ్యంగ్యంగా. భానుమూర్తి కళ్ళు ఎర్రబడ్డాయి. తల్లిమాటనే లక్ష్యం చేయలేదా తన భార్య? ఇంతకన్నా ఘోర అపరాధం ఏమన్నా వుందా? తను లక్షమాట్లు చెప్పాడు- మంచో, చెడో మా అమ్మ చెప్పిందానికల్లా 'ఊ' అనమని.

"విషయం ఏమిటమ్మా?" అన్నాడు ఒక పక్క కోపం రాజుకుంటుండగా.

"తులసికోట అలికిపెట్టవే అన్నాను. ఇల్లలుకుతూ కూర్చుంది. తూర్పు చూడవే అంటే పడమర చూసే దానితో ఎలారా నెట్టుకొచ్చేది?" అని ఒక విసురు విసిరింది.

భానుమూర్తి గబగబా వంటింటికేసి వెళ్లాడు. అరుణ గోమయంతో నేల అలుకుతోంది.

"అరుణా! యిలా రా" అని గద్దించాడు.

చేతిలో పని అలాగే వదిలి 'ఏమిటండీ?' అని వచ్చింది.

"అమ్మ తులసి కోట అలకమంటే వంటిల్లు అలుకుతూ కూర్చోవటం ఏమిటి? తల తిరుగుతోందా ఏమన్నా?"

"వంటిల్లు అలకమన్నదీ ఆవిడే. మధ్యలో వచ్చి తులసికోట అలకమంటే ఎలా వుంటుంది చెప్పండి? ఒక పని తర్వాత మరోపని చేస్తే తెములుతాయా, అది సగం, ఇది సగం చేస్తే తెములుతాయా?"

ఆమె చెంప ఛెళ్ళుమంది.

"రాస్కెల్! ఎదురు ప్రశ్నలు వేయొద్దని వెయ్యిమార్లు చెప్పాను. ముందువెళ్ళి తులసికోట అలుకు..." అంటూ విస విసా వెళ్ళిపోయాడు.

"అరుణ బాధపడలేదు. జివ్వుమంటున్న చెంపని తడుముకునే యత్నమూ చెయ్యలేదు. ఆమెకు రాత్రి అనుభవించినది "అరచేతిలోస్వర్గ"మన్న విషయం తెలుసు. ఆ అనుభవం ఒక కల. కలలు రాత్రి ముగుస్తుండగానే కరిగిపోతాయి.

మౌనంగా యింత ఆవుపేడ చేతిలోకి తీసుకుని, తులసికోట వైపు కదిలిపోయిందామె.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)